# బరితెగించిన ఆడది

**హు!** తన సంగతి తెలీదు. కోపం వస్తే ఏం చేస్తాడో అసలు తనకే తెలీదు. ఏం చేసినా చేస్తాడు. ఆఁ! తను మరీ మెత్తగా వుంటున్నాడని అందరికీ అలుసయిపోయింది. తన మెత్తదనం మూలానే చిన్నప్పట్నుంచీ ఇంతవరకూ అందరూ తన మీద స్వారీ చేశారు. చిన్నప్పుడు అమ్మమ్మ తన మెత్తదనం చూచి తనకు ఇష్టం లేకపోయినా పెరుగన్నం తినిపించేది. ఈ మెత్తదనం చూస్తే నాన్న తనని బి.ఏ. చదువుతానంటే వద్దని బి.కామ్‌లో చేర్పించేశాడు. మళ్ళీ ఈ మెత్త దనం మూలానే అమ్మ తనకి అప్పుడే పెళ్ళి వద్దో అని గోలెడుతున్నా వినిపించుకోకుండా బాంకులో ఉద్యోగం దొరికీ దొరగ్గానే ఓ పిల్లను చూచి పెళ్ళి చేసి పారేసింది. పోనీ అక్కడితో గొడవ వదిలిపోయిందనుకుంటే తన మెత్తదనం సంగతి అమ్మ ద్వారా క్లూ లాగేసి నిన్నగాక మొన్న వచ్చిన పెళ్ళాంగారు కూడా తనని ఆటలు పట్టించేస్తోంది. లాభంలేదు.... ఏ మాత్రం వీల్లేదు. ఇవాళ్టి నుంచీ తనోకర్కోటకుడుగా, రాతి హృదయం గలవాడిగా, అతి దుర్మార్గుడిగా, తెలుగు సినిమాలో ఇంటర్వల్ తరువాతి విలన్‌లా, తన హెడ్ ఎకౌంటెంట్‌లా, మారిపోవాలి.... హు! లేకపోతే అంత అలుసేం? మొగుడంటే అంత చవకేం? కట్నం లేకుండా పెళ్ళాడాడు గాబట్టి ఆవిడగారికి మొగుడి వాల్యూ ఏం తెలియడం లేదు... ఎంతమంది కట్నాలు ఇచ్చీ, మంచి మొగుళ్ళు దొరక్క చచ్చిపోతున్నారు! అంతవరకెందుకూ? ప్రక్క వీధిలో విమలమ్మగారి అమ్మాయికి పదివేల కట్నం మిచ్చి పెళ్ళి చేస్తే ఆ మొగుడు పెళ్ళయిన రెండో రోజునే కోర్టులో విడాకులకి దావా వేశాడు. తన హెడ్ ఎకౌంటెంట్‌గారి అమ్మాయి మొగుడు పెళ్ళయిన అయిదో రోజునే తాగొచ్చి మామగారితో సహా అందర్నీ చావగొట్టి, బయటగెంటి తలుపు గొళ్ళెం పెట్టేశాడు.

వసారాలో తాళం వేసి వున్న తలుపు వంక వుండుండి గుడ్లురిమి చూస్తూ, పళ్ళు పటపటమని (శబ్దం రాపోయినా) కొరుకుతూ, పై డైలాగులన్నీ అనుకొన్నాడు గిరి. కాసేపటూ ఇటూ తిరిగి తాళం కప్ప వంక మరోసారి చూసి మళ్ళీ అందుకున్నాడు.

"అవును మొగోడు అన్న తరువాత సవాలక్ష పన్లుంటాయి. ఉంటాయేమిటి వున్నాయి. అంచేత ఒకోసారి వేసుకున్న సినిమా ప్రోగ్రాం మిస్ అవ్వచ్చుగాక, అలా

అన్జెప్పి టపీమని ఇల్లు తాళం పెట్టేసి పక్కింటివాళ్ళతో సినిమాకి చెక్కయ్యడమే? మొగుడుగాడు ఆఫీసులో చచ్చీ చెడీ సాయంత్రం వరకూ పన్జేసీ ఇంటి కొస్తే మొహం పగల గొట్టినట్లు ఇంటికి తాళమా?.... ఎదురుగా కనబడితే బుగ్గలు పిండేశేను మరి... తన సంగతి పూర్తిగా తెలీదు.... అయినా అనుకోవాల్సిన పనేముందీ? కాలం అలాంటిది. మరీ బరితెగించిపోయారు ఆడాళ్ళు." కసిదీరా తిట్టుకొంటున్నాడు గిరి.

ఇంతలోనే ఎదురింట్లో పనిచేసే కుర్రాడు రాకెట్‌లా దూసుకొచ్చి "సార్! మన భార్యగారు....ప్రక్కింటి భార్యగారితో సిన్మాకి పోయార్. హీ తాళం చెవీ మీకూ ఇమ్మన్నార్...." అని తాళం చెయ్యి మీదకి విసిరేసి మళ్లీ రాకెట్‌లా దూసుకు వెళ్ళిపోయాడు.

"వాట్! వరేయ్ వెధవ్‌య్! ఫూల్! తెలుగు నేర్చుకోరా! మన భార్యగారేమిట్రా రాస్కెల్!" మండిపోయాడు గిరి...

ఇందాకటి కోపం ప్లస్ ఆ మంట కలసి తగలబడిపోవాల్సిన పని... కాని తగలడటంలేదు.

"హు! హు!" అని రెండుసార్లనుకొని తలుపు తాళం తీసి లోపలకు వెళ్ళాడు లోపల బల్లమీద రెపరెప కొట్టుకొంది విప్పి చూశాడు గిరి.

"శ్రీవారికి,

మీకోసం ఆరున్నర వరకూ ఎదురు చూశాను. "పతియే ప్రత్యక్ష దైవం" సినిమా ఇవాళ ఆఖరిరోజు. అంచేత ప్రక్కింటి పిన్నిగారితో వెళ్తున్నాను. ఫ్లాస్కులో కాఫీ వున్నయి అన్నం కూరలు వండే వుంచాను.... ఆకలి వేస్తే భోంచేయండి...

మీ సతి అనసూయ."

ఆ చీటిని ఓ లక్ష ముక్కలు చేసి బయట పారేశాడు గిరి.

"హు! అయినా ఈ ఆడవాళ్ళనని ఏం లాభం! ఈ బుద్ధిలేని మొగాళ్ళననాలి. లేకపోతే అంత అలుసివ్వడమేమిటి వీళ్ళకి?.... ప్రక్కింటి బాబాయి మరీ చచ్చు బాబాయి. పెళ్ళయిందగ్గర్నుంచీ తనే వంట చేసి పెడుతున్నాడు పిన్నికి... ఎదురింటి సుబ్బిగాడూ అంతే! ఈ మధ్య నెలరోజుల్నుంచీ సెలవు పెట్టి మరీ వంట చేస్తున్నాడు.

"ఇదేమి జబ్బురా నీకు" అని తమ ఫ్రెండ్సందరూ మొన్న నిలేస్తే "మా ఆవిడకి వంట్లో బావుండలేదంటూ" ఖొంకేశాడు. సాంత్రమయేసరికి టింగురంగామంటూ సినిమాకి బయల్దేరే వాళ్ళావిడకి ఏం జబ్బో తన కర్థం కాలేదు. తనకనేమిటి? ఓ వందమంది

సైంటిస్టులని ఓ కమిటీగా వేసి పరిశోధించమంటే వాళ్ళకీ అర్థం కాదు! గ్యారంటీ ఇస్తాడు తను. ఆ మూడో ఇంట్లో క్రొత్తగా పెళ్ళయిన జంట వుందా అంటే వాళ్ళిద్దరిలో మొగుడెవరో పెళ్ళాం ఎవరో తనకింతవరకూ తెలియనివ్వలేదు వాళ్ళు. అలాంటి అంట్ల వెధవయి పోయాడు వాడు. ఇలాంటి వాళ్ళందరి మధ్యా వుంటే తన పెళ్ళాం మాత్రం, పాడయిపోయిందంటే....పాడవదూ మరి! తనను ఝుంమ్మంటూ వాళ్లందరిలో జమకట్టేసింది! కాని తనకి కోసం వస్తే ఏదో ఒకటి చేసేస్తాడన్న సంగతి ఇంకా తెలీదు. సామానంతా సర్దేసి, ఆ పెట్టెనీ, తననీ రైలెక్కించి, పుట్టింటిక పంపించేయగలడన్న సంగతి గ్రహించుకోలేదింకా! అవునులే! దానికయినా అనుభవమేముంది? పాపం! ఈ దెబ్బతో తెలిసి వస్తుంది. ఎంత బ్రతిమాలినా చస్తే తగ్గడు తను. ఇక్కడికే చాలా బోలెడు అలుసిచ్చేశాడు. తాతయ్య చెబుతుండేవాడు వాళ్ళ కాలంలో ఆడవాళ్ళు పిల్లులంట! వంట ఆడవాళ్ళే చేసే వాళ్ళుట! మగాళ్ళ బట్టలన్నీ ఆడాళ్ళే ఉతికేవాళ్ళట! మొగుడు వళ్ళు కాలిచస్తున్నా సరే ఎదుటబడి మాట్లాడ్డానికి సిగ్గుపడే వాళ్ళుట! మొగుడు "హేయ్" అని కోపంతో ఒక్క కేక వేస్తే సంక్రాంతి చలిమంటల వరకూ వణుకుతూ కూర్చునే వాళ్లంట! అప్పటికయినా నవ్వుతూ మాట్లాడితేనే వణుకు తగ్గేదిట. లేపోతే ఆ నెక్ట్స్ సంక్రాంతి వరకూ కంటిన్యూ అయేదిట! మొగుడికి కాస్తంత, వంట్లో నలతగా వుంటే.... దేముని గదిలో విగ్రహాల ముందు పూజలు చేసి చేసి శోష వచ్చి పడిపోయే వాళ్ళట.... ఆనక మళ్ళీ ఆ మొగుడే జ్వరం తగ్గిపోయి లేచి వచ్చి పెళ్ళాం మొఖం మీద చన్నీళ్లు కొట్టేవరకూ లేచే వాళ్లు కాదుట!

హబ్బో! అప్పటికీ ఇప్పటికి అసలు పోలికేమయినా వుందా? ఆడాళ్ళు బరి తెగించారని తను అనుకొన్నాడంటే అనుకోడూ మరి? ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులోనికి వంచుకొని తాగాడు గిరి. చాలా అద్భుతంగా వున్నట్లనిపించింది కాపీ.

అయినా తమాయించుకొన్నాడు గిరి.

"ఛీ! కాఫీ దాని మొఖంలా వుంది! ఏం బావుండి చావలేదు!" అని విసుక్కొన్నాడు. భోజనం చెయ్యాలిట ఆకలి వేస్తే, లేపోతే చెయ్యొద్దనేగా అర్థం? ఏమయినా సరే భోజనం చేయగూడదని నిర్ణయించుకొన్నాడు గిరి. అంత గతి లేదనుకొందేమో.

మరో గంట గడిచిపోయింది.

చాలా ఆకలి వేసినట్లనిపించింది గిరికి. "అయినాసరే, అన్నం తినను" అనుకొన్నాడు గిరి. అటూ ఇటూ పచార్లు చేయసాగాడు. టైము తొమ్మిదవుతోంది. ఇల్లంతా చీకటిగా

వుంది స్విచ్ నొక్కాడు గిరి.

"ఏం కూర వండిందో భోజనంలోకి!" ఆలోచన వచ్చింది గిరికి. కాసేపాగి 'ఏదయితే తనకేం?' అనుకొన్నాడు. మరికొద్ది నిమిషాలు గడిచినయి.

"అవును.... ఏం వండిందో చూస్తే ఏం పోయింది? తనెలాగూ తినబోవడం లేదు కదా!" అని సమర్థించుకొని వంటింట్లోకి నడిచాడు.

ఉల్లిపాయలతో దోరగా వేగించిన బంగాళా దుంపల కూర! ఒక్కసారిగా నోట్లో గిన్నెడు నీళ్ళూరినయి గిరికి. మరో గిన్నెలో కమ్మని పప్పుచారు. గ్లాసుతో గడ్డపెరుగు. తను పడిచచ్చే వంటకాలన్నీనూ!

ఇలా అయితే లొంగిపోతానని దాని వుద్ధేశ్యం! "చస్తే భోజనం చేయను! ఏమనుకొందో" అనుకున్నాడు గిరి.

తిరిగి పచార్లు మొదలెట్టాడు, కడుపులో ఎలుకలు రేసుకోర్సులో పరిగెత్తినట్లు తిరుగుతున్నాయి.

"భోజనం చేస్తే ఎలా ఉంటుంది?" ఆలోచించాడు గిరి. తనయితే ఏమీ తగ్గిపోవడంలేదు. కోపం అలాగే వుంచుకొంటే సరి, అయినా భోజనానికి సంబంధమేముంది?

"ఏమీ లేదు! మహా రాజులా భోంచేయవచ్చు!" అనుకొన్నాడు గిరి. వెంటనే వంటింట్లోకి నడిచి పీట వాల్చుకుని వడ్డించుకొన్నాడు. పదార్థాలు చాలా బావున్నట్లున్నాయి. అయితే మాత్రమేం!" అనుకొన్నాడు మళ్లీ. భోజనం ముగించి చెయ్యి కడుక్కొని లేచాడు. నిద్ర బ్రహ్మాండంగా వస్తోంది.

"ఏమయినా సరే నిద్రపోగూడదు. నిద్రపోతే కోపం సంగతి మరిచిపోవచ్చు" కుర్చీలో కూర్చుని ఆ వేళ పేపరు చదవ సాగాడు.

తొమ్మిదీ ముప్పావు అయిపోయింది. సినిమాల నుంచి జనం తిరిగి వచ్చేస్తున్నారు. అనసూయ వచ్చేస్తుందిక! అయినా ఫరవాలేదు. తన కోపం గానే వున్నాడు. అనుకొని శాంతపడ్డాడు గిరి. కొద్దిగా ఆశ్చర్యం కూడా కలిగిందతనికి. తనెప్పుడూ ఇంత కోపంగా వుండలేదు!" దూరంగా ప్రకింటి పిన్ని గారి గొంతు. వచ్చేస్తోంది అనసూయ. అయితే కోపం ఎక్కడా అంతుకనిపించేదతనికి. పళ్ళు పటపట లాడించేడు. మొఖం చిట్లించేడు. కళ్ళు నులుముకొన్నాడు ఎర్రబడుతవేమోనని! జుట్టు కొద్దిగా చిందరవందర చేశాడు. చొక్కా చేతులు పైకి మడిచాడు.

ఈ సారికి పోనియ్యరాదుటోయ్! అంతరాత్మ సజెషను.

"నువ్వాగబోకు, మధ్యలో వచ్చావంటే డొక్క చించేస్తాను" కోప్పడ్డాడు గిరి.

"ఎంత కోపమయితే మాత్రం మరీ అంత పిచ్చికోప మేమిటి లేస్తూ!" సాగదీసింది అంతరాత్మ.

ఈ అంతరాత్మేదో సినిమాలోలా ఎదుటకి వస్తే పీకపిసికేద్దామన్నంత కోపం వచ్చింది గిరికి.

దీని దుంపతెగా! మనకి బయటికి ఒక్క అంతరాత్మా కనపడి చావదుగాని తెలుగు సినిమాల్లో ఒహోసారి డజన్ల కొద్దీ కనబడుతుంటయి. గోడలెక్కి కిటికీలెక్కి మరీ నుంచుంటయి.

అనసూయ వచ్చేసింది.

గిరి సీరియస్ అయిపోయేడు.

"ఏమండీ! ఇంకా నిద్రపోలేదూ? భోజనం చేశారా?.... అబ్బ సినిమా ఎంత బావుందని? నిజంగా మీరు రావలసిందండీ!....మధ్యలో ఎంచేతో తల నొప్పి – అలాగే కూర్చుని సినిమా అయింతరువాత వచ్చాను."

నవ్వుకొన్నాడు గిరి. తను కోపంగా వున్న సంగతింకా గ్రహించలేదు పిచ్చి పిల్ల అనుకొన్నాడు. ఆమె అమాయకత్వం చూస్తే జాలి కలిగింది.

"ఒక నిముషం! భోజనం చేసి వస్తాను!" అంది అనసూయ లోనికి నడుస్తూ. వెళ్తూంటే ఆమె వంకే చూశాడు గిరి.

తనకిష్టమయిన గులాబీ రంగుచీరా, అదే రంగు జాకెట్టూ మల్లెపూలూ...

"అనసూయ చాలా బావుంటుంది" అనుకొన్నాడు గిరి. వుంటుందేమిటీ వుంది. అందుకే గదా కట్నం లేకుండా పెళ్ళాడేడు తను.

మరు నిముషంలోనే బయటికి తిరిగి వచ్చిందామె.

"పదండి. ఇప్పటికే బోలెడు ఆలస్యమయింది. నిద్రముంచుకు వస్తోంది" పడగ్గదిలోకి నడిచిందామె.

"ఇప్పుడే తను కోప్పడాలి" ఆమె వెనుకే లోనికి వెళ్తూ అనుకొన్నాడు గిరి. అనసూయ అతని గుండెలకి ఆనుకొంటూ అడిగింది "నా మీద చాలా కోపం వచ్చింది గదూ?"

"హారి! కనుక్కుందన్నమాట!" అనుకొన్నాడతను.

"వంటింట్లోంచి అప్పుడే వచ్చేవేం? భోంచేయలా?"

"లేదండీ! నే వెళ్లేప్పటికి కుక్క ఒకటి అన్నం తినేస్తోంది. మీరు దొడ్డి తలుపు వెయ్యడం మరచిపోయారు!"

"మరి నీ భోజనం?

"దాన్దేముందండీ... ఒక్కపూట లేపోతే చచ్చిపోతానా?"

"అరె పాపం! నేనెంత వెధవ పనిజేసేను?" అనుకొన్నాడు గిరి.

అట్లయితే మరిప్పుడెలా?"

"మరేం ఫర్వాలేదు లెండీ! ఒక్కపూటకేగా! పైగా నాకు తలనొప్పిగా కూడా వుంది." నవ్వింది అనసూయ.

నవ్వినప్పుడు ఆమె బుగ్గలు సొట్టపడి చాలా అందంగా కనిపించింది గిరికి. ఆమె ముఖాన్ని రెండు చేతుల్తోనూ పట్టుకొని "నువ్వివాళ చాలా అందంగా వున్నావు" అన్నాడు.

"ఎందుకనో?" అంది అనసూయ.

"నాకేం తెలుసు.... అదిసరే.... నీ మీద నాకు బోలెడె కోపం వచ్చింది!"

"ఎందుకలా పాపం!" అంది నవ్వుతూ.

"ఎందుకేమిటి.... ఇల్లు తాళం బెట్టి.... వెళ్ళిపోతే....పైగా ఒక్కడిని ఒంటరిగా–"

"మీకోసం చూసి చూసి వెళ్ళాను. సినిమాలో కూడా మీ గురించే ఆలోచన – భోంచేశారో లేదో! కాఫీ త్రాగారో లేదో...'

ఐస్ కన్నా కొన్ని వందల డిగ్రీలు చల్లగా అయిపోయాడు గిరి.

"ఎందుకు వెళ్ళానా అనిపించింది. వచ్చేస్తుంటే!"

"ఆ వెళ్తే మాత్రమేముంది లేస్తూ!"

"మీరెన్నన్నా చెప్పండి.... ఇక నుంచి అలా వెళ్ళకూడదనుకొన్నాను!"

"ఛఛ! అదేవిటీ! ఒక్కోసారి నాకాలస్యం అవ్వచ్చు. అలా అలా అని నువ్వు వేసుకొన్న ప్రోగాం మానుక్కొోవాలేమిటి? మరీ రాముని వారి కాలంలో అమ్మాయిలా మాట్లాడకు! – ఆ మాట కొస్తే అసలా ఆడాళ్ళు ఇంకా బాగా ఎడ్వాన్స్ కావాలంటాను" అన్నాడు గిరి.

"మీరెంత మంచి వాళ్ళండీ!" నవ్వింది అనసూయ.

"ఇంతకూ నీ భోజనం...."

"ఊరుకొందురూ! ఒక్క పూట భాగ్యానికి గొడవ...."

"ఉహూ! అలాక్కాదు. టిఫిన్ కారియర్ తీసుకురా! హోటల్నుంచి తీసుకొస్తాను!"

"అబ్బ! ఇప్పుడెందుకండీ!"

"నీకు తెలియదు – అసలే తలనొప్పంటున్నావు... ఆకలి మీద మరీ ఎక్కువవుతుంది. రేపు గూడా బాగా రెస్టు తీసుకో.... ఆఫీసుకి వారం రోజులు సెలవు పెడతాను.... కాస్త వంటలో అదీ నీకు సాయంగా –" సైకిలు బయటికి నడిపించాడు గిరి.

"వద్దంటే వినరుకదా!" టిఫిన్ కారియర్ అందించిందామె.

కారియర్ అందుకుని సైకిలు మీద రివ్వున బయలుదేరాడు గిరి.

"పాపం! అనసూయ చాలా మంచిది" అనుకొన్నాడు చలిగాలి విసురుతోంది.

"ఇంకా నయం! తమ ముందూ వెనుకా చూడకుండా కోప్పడేశేవాడే కొద్దిగా వుంటే! ఇంకెప్పుడూ అసలు చస్తే అనసూయ మీద కోపం తెచ్చుకోకూడదు" సైకిలు మరింత వేగం అందుకొంది.